టీడీపీ డీఎన్‌ఏ రౌడీయిజం!

చంద్రబాబూ.. ఈ ప్రశ్నలకు బదులేది?

1. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని మీరు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో మీ పార్టీ కాలకేయులు చేస్తున్న అరాచకాలకు ఏమైనా బ్యాలెన్స్ ఉందా? మీకు గెలుపులే కనిపిస్తున్నాయా? 'రౌడీయిజం చేయాలి' అని మీ మంత్రి అందరి ముందూ చెబితే, ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా జరిగాయని ప్రజల కళ్లలోకి చూసి ఎలా చెప్పగలరు? మీ మంత్రి మాటే మీ మాటకు అడ్డురావడం లేదా?

2. ఒకప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరడిగిన హక్కు ఇప్పుడేమైంది? మీ అభ్యర్థి నామినేషన్ వేయకుండా ఎవరైనా గుమ్మం దగ్గర నిలబడితే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందనేవారు కాదా? ఈరోజు అదే మాట వైయస్సార్‌సీపీ అభ్యర్థి అంటే మీ సమాధానం ఏమిటి?

3. 'ఎదుటివాడు నిలబడకూడదు' అన్నది మీ పార్టీ విధానమా? కాదంటే ఆ మాట అన్న మంత్రిని నలుగురి ముందూ ఎందుకు తప్పపట్టరు? విజయాన్ని సభ పెట్టి చెప్పుకున్నప్పుడు, తప్పును కూడా అంతే బహిరంగంగా సరిదిద్దాలి కదా!

4. మీ కార్యకర్త కొడితే కేసు ఉండదని ఎమ్మెల్యే భరోసా ఇస్తే, దెబ్బతిన్నవాడికి భరోసా ఎవరిస్తారు? పోలీస్‌స్టేషన్‌కు వెళ్లబోయే మనిషి ముందుగా ఎదుటివాడి పార్టీ జెండా చూసుకోవాలా? మీ పాలనలో చట్టానికి తెచ్చే గౌరవం ఇదేనా?

5. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసినవాడూ ఈ రాష్ట్ర పౌరుడే కదా? ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగి జీతానికీ, ఆ కుటుంబానికి రేపు అవసరమయ్యే సీఎం రిలీఫ్ ఫండ్‌కూ పార్టీ విధేయతను షరతుగా పెడితే, ఇక ప్రభుత్వానికీ పార్టీ ఆఫీసుకూ తేడా ఏముంటుంది?



6. నామినేషన్ గుమ్మం దగ్గరే ప్రత్యర్థిని ఆపేస్తే, మీరు గెలిచింది ఎవరి మీద? ఓటరు ముందుకు ఇద్దరినీ రానిచ్చి తీర్పు కోరే ధైర్యం లేనప్పుడు, ఏకగ్రీవాల సంఖ్య చూపించి ప్రజలు మావైపే ఉన్నారని ఎలా చెప్పుకుంటారు?

7. పోలీసులకు నేనే సూచనలు ఇస్తున్నానని మీ ఎమ్మెల్యే చెప్పుకోవడం మీకు అభ్యంతరంగా అనిపించదా? రక్షణ కావాలంటే తనను అడగమనే నాయకుడి ఎదుటే పోలీసు అధికారి ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే, ఆ అధికారి స్వతంత్రంగా పనిచేస్తున్నారని ప్రజలెలా నమ్మాలి?

8. జెండా పట్టుకున్నవాడి బెదిరింపులకూ, మంత్రి కుర్చీలో ఉన్నవాడి బెదిరింపులకూ తేడా మీకు తెలియదా? 'భవిష్యత్తు అంతా మనమే' అని మంత్రి గుర్తుచేస్తే, రేపు ఏ పనికైనా ఆ ప్రభుత్వం దగ్గరకే వెళ్లాల్సిన సామాన్యుడు ఎంత ఒత్తిడికి గురవుతాడో ఒక్కసారి ఆలోచించారా?

9. పదవుల పంపకంలో తేడా వస్తేనే పోలింగ్ సంగతులు బయటకు రావాలా? మీ పార్టీ కార్యకర్తే రిగ్గింగ్ ప్రస్తావన తెచ్చినప్పుడు నిజం తేలాలని అడిగే తొలి వ్యక్తి మీరే కావాలి కదా! గెలుపు మీద నమ్మకం ఉంటే విచారణకు వెనకడుగెందుకు?

10. మీరు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నది ఎవరి కోసం? మీకు ఓటేసినవాడికి మాత్రమే అండగా ఉండటానికా? మీకు ఓటేయని వాడికి అన్యాయం జరిగినా చూసతూ ఊరుకోవడానికా? మీ నేతల మాటలకు హద్దు పెట్టకపోతే, ఆ అరాచకానికి మీ మౌనమే అండ అనుకోవడానికా? ఈ ప్రశ్నలకు ఏమని బదులిస్తారు?